నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఈపూరు : మండలంలోని ఊడిజర్ల, ముప్పాళ్ల, కొచ్చర్ల, ఈపూరు సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ రఫీ తెలిపారు. సబ్‌స్టేషన్‌ల పరిధిలో 11 కేవీ, ఎల్‌టీ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్‌ల మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

శావల్యాపురం: వేసవిలో తాగునీటి సమస్య లేకుండా అన్నీ శాఖల అధికారుల సమన్వయంతో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అధ్యక్షతన మండల స్థాయిలో ప్రజాప్రతినిధులు, అధికారులతో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ త్వరలో సాగర్ జలాలు నిలుపుదల చేస్తారని, వేసవిలో ప్రజలు తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడకుండా ఉండటానికి మంచినీటి చెరువులు, నీటి కుంటలు, వాగులు, తదితరన్నీ సాగర్ జలాలతో నింపాలన్నారు. జలజీవన్ మిషన్ పథకంలో 24 గ్రామాల్లో రూ.17 కోట్లు వ్యయంతో పనులు జరుగుతున్నాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పొలాలకు వెళ్లే గ్రావెల్ రోడ్లు క్షేత్రస్థాయిలో గుర్తించి ఉపాధి పథకంలో ద్వారా సర్పంచుల సహకారంతో పారదర్శకంగా చేయాలని ప్రజలు పదితరాల పాటు చెప్పుకునేలా పనులు చేయాలన్నారు. మండలంలోని 46 అంగన్‌వాడీ సెంటర్లు చిన్నారుల ఎదుగుదలకు అనుగుణంగా ఉండేలా ఒక్కో సెంటరుకు క్రీడా పరికరాలకు జిల్లా కలెక్టరు రూ.2వేలు మంజూరు చేశారన్నారు. పశుసంవర్ధకశాఖ వారి ఆధ్వర్యంలో వినుకొండ, ఈపూరు మండలాల పరిధిలో మొబైల్ పశుసంచార వైద్యశాల ద్వారా మెరుగైన సేవలను పాడిపోషకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ నంబూరి ప్రభావతి, ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, తహసీల్దారు షేక్ జాన్‌సైదులు, ఈవోపీర్డీ పి.సుగుణ, మండల కోఆప్షన్ సభ్యులు దూదెకుల హుస్సేన్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మోడల్ సిటీగా మార్చేస్తాం

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- రెండు వార్డుల్లో కొనసాగిన గడప గడపకు కార్యక్రమం



పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు

వినుకొండ (నూజెండ్ల): పట్టణాన్ని మోడల్ సిటీగా అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. పట్టణంలోని సచివాలయం-8 పరిధిలోని 21, 25వ వార్డుల పరిధిలో శనివారం జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వార్డులోని ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ కుల, మత, పార్టీలకతీతంగా ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అందజేయడం, ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించడమే గడప గడప ముఖ్య ఉద్దేశమన్నారు. గత పదేళ్లల్లో వినుకొండ పట్టణంఎలా ఉంది, మా ప్రభుత్వం హయాంలో ఎలా అభివృద్ధి చెందిందో పట్టణ ప్రజలు గుర్తించాలన్నారు. గతంలో తాగునీటి కోసం బిందెలతో కొట్టుకునే సంస్కృతికి తెరదించి వినుకొండ పట్టణానికి ప్రతిరోజూ తాగునీరు అందిస్తున్న ఘనత తమదేనన్నారు. రానున్న రోజుల్లో ప్రతిరోజూ రెండు పూటలా తాగునీరు అందించడమే లక్ష్యంగా పనులు జరుగుతున్నాయన్నారు. వినుకొండ పట్టణంలో ఎన్ఎస్‌పీ కాలువ హైదరాబాద్ టాంక్‌బండ్‌లా ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటు చేశామని తెలిపారు. పట్టణంలో ఏ ఇంట్లో చూసినా లక్షల రూపాయల సంక్షేమ పథకాలు అందాయని, ప్రజలు సంక్షేమ పథకాల పట్ల పూర్తి సంతృప్తిగా ఉన్నారన్నారు. పారదర్శకంగా అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేస్తుంటే టీడీపీ నాయకులకు మింగుడు పడక చిల్లర రాజకీయాలతో రాజకీయ లబ్ధికోసం అభివృద్ధికి అడ్డుపడుతున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే జీవీ పదేళ్లు ఎమ్మెల్యేగా ఉండి పట్టణ ప్రజలకు ఏం చేశారో చెప్పాలన్నారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా చివరకు ప్రజలే విజయం సాధిస్తారని, తనను గెలిపించిన ప్రజల కోసం అభివృద్ధిలో రాజీ పడకుండా చేసి చూపిస్తామని హామీ ఇచ్చారు.

అలాగే వ్యాపార వర్గాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. వత్తిడులు, బ్లాక్‌మెయిలింగ్ ఉండదనీ, ప్రశాంతంగా వ్యాపారం చేసుకునేలా సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్‌లు గర్రె శ్రీనివాసరావు, తెల్లాకుల రాజేష్‌ఖన్నా, షకీలా దస్తగిరి, రెడ్డి నాగపద్మ, నంది నరసింహారావు, మార్కెట్‌యార్డు చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లుయాదవ్, సొసైటీ చైర్‌పర్సన్ అనుమోలు నాసరరెడ్డి, డాల్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు పెండేల పుల్లారావు, రెడ్డి నగేష్‌బాబు, కొత్తమాసు శివ, పులిపాటి రామారావు, కమిషనర్ బి.శ్రీనివాసులుతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

టాప్-20లో నరసరావుపేట పురపాలక సంఘం

- రూ.16.25 కోట్ల డిమాండ్‌లో రూ.13.76 కోట్లు వసూలు
- కమిషనర్, రెవెన్యూ, సచివాలయ ఉద్యోగులను అభినందించిన ఎమ్మెల్యే గోపిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి, కమిషనర్ శ్రీనివాసరావు

నరసరావుపేట: మున్సిపల్ అధికారులు, సిబ్బంది కృషితో ఆస్తిపన్ను వసూళ్లలో పురపాలక సంఘం రాష్ట్రంలో టాప్-20లో ఉందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రశంసించారు. శనివారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయంలో ఆస్తిపన్ను వసూళ్లపై మున్సిపల్ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తులకు చెల్లించాల్సిన పన్నులు మినహాయించి మొత్తం రూ.16.25 కోట్ల ఆస్తిపన్ను వసూలు చేయాల్సి ఉండగా రూ.13.76 లక్షలు (84.65 శాతం) వసూలైందన్నారు. ప్రభుత్వం కల్పించిన వడ్డీ రాయితీ, అధికారులు, సిబ్బంది కృషి దీనికి కారణమన్నారు. పురపాలక సంఘం ఆర్థికంగా బలంగా ఉంటేనే ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన సులభంగా ఉంటుందన్నారు. ఇన్‌చార్జి కమిషనర్ డి.శ్రీనివాసరావు ఎప్పటికప్పుడు తనకు సమాచారం ఇస్తూ తనను కూడా భాగస్వామ్యం చేశారన్నారు. డీఈ ఓలేటి శ్రీనివాసరావు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఈదురు గాలులకు పడిపోయిన చెట్లు

రొంపిచర్ల: మండలంలో శనివారం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. గత కొద్ది రోజులుగా ఉరుములు, మెరుపులతో వర్షం కురవటం వలన రైతులు కళ్ళాల్లో ఆరబోసిన మొక్కజొన్న, మిర్చి పంటలను కాపాడుకోవడానికి నానా తంటాలు పడ్డారు. ఆయా పంటల తడవకుండా వాటిపై పరదా పట్టలు కప్పారు. ఈదురు గాలులకు మండలంలో మునమాక - విప్పర్లపల్లి గ్రామాల మధ్య గల చెట్లు పడిపోయి రోడ్డుకు అడ్డంగా ఉండటం వలన ఆయా గ్రామస్తుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీనికి తోడు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాల వలన మొక్కజొన్న, మిర్చి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

న్యాయవాదుల సంఘం సభ్యులకు సన్మానం



సెక్రటరీ, ట్రెజరర్‌లను సన్మానిస్తున్న జెడ్పీ కోఆప్షన్ మెంబరు గుండాల స్వెనోమ్

వినుకొండ(నూజెండ్ల): శుక్రవారం జరిగిన న్యాయవాదుల సంఘం ఎన్నికల్లో సెక్రటరీ, ట్రెజరర్‌గా గెలుపొందిన కొత్తకోట హనుమంతరావు, కాకాని నాగేశ్వరరావులను జెడ్పీ కోఆప్షన్ మెంబరు గుండాల స్వెనోమ్ ఆధ్వర్యంలో పట్టణంలోని తన కార్యాలయంలో శనివారం ఘనంగా సన్మానించారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఈటీబీసీ చర్చి అధ్యక్షులు పందుల సాల్మన్, మాజీ అధ్యక్షులు బేతం శ్యాంప్రసాద్, సెక్రటరీ కట్టెంపూడి నాగేశ్వరరావు, గొల్లపల్లి రాజు, న్యాయవాదులు ఎం.ఎలీషాబాబు, ఎస్. శేఖర్ బాబు, ఎస్. అశోక్‌బాబు, కాశంగి చెన్నయ్య, దుగ్గిపోగు విజయ్ పాల్గొన్నారు.

పూరిల్లు ఆహుతి

శావల్యాపురం: మండలంలోని గంటావారిపాలెం గ్రామం మంచ్యాల అంజమ్మ నివాస గృహం పూరిల్లు ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతి అయిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఇంటిలో దాచుకున్న రూ.20 వేలు నగదుతో పాటు వంట సామగ్రి పూరిల్లు సర్వస్వం అగ్నికి ఆహుతి అయినట్లు చెప్పారు. ఈ సంఘటనలో కట్టుబట్టలతో బాధితురాలు బయట పడినట్లు రూ.లక్ష రూపాయలు ఆస్తి నష్టం వాటిల్లినట్లు స్థానికులు తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో రావటంతో మంటలను అదుపులోకి తేవటంతో పెను ప్రమాదం తప్పినట్లు స్థానికులు చెప్పారు.

వ్యభిచార గృహంపై దాడి: ఆరుగురు అరెస్ట్

నరసరావుపేట టౌన్: వ్యభిచార గృహంపై దాడులు నిర్వహించి ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు టూటౌన్ సీఐ వీరేంద్రబాబు శనివారం తెలిపారు. శిశుమందిర్ ప్రాంతంలో నివాస గృహాల మధ్య అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఓ గృహంపై దాడులు నిర్వహించామన్నారు. అక్కడ వ్యభిచార నేరానికి పాల్పడుతున్న ముగ్గురు మహిళలు, ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్నామన్నారు. గత కొంత కాలంగా ఐలా నరేష్ కుమార్ అద్దెకు గృహాన్ని తీసుకొని వ్యభిచార కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితులను కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.

మౌలిక సదుపాయాల అభివృద్ధి.. మేమే చేశాం

నరసరావుపేట: రాజీవ్ స్వగృహ సమీపంలో నిర్మించబోతున్న నూతన ప్రార్థనా మందిరం ఓమేగా టెంపుల్ దేవుని ఆశీస్సులతో వేగంగా నాణ్యతతో నిర్మాణం పూర్తిచేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆకాంక్షించారు. శనివారం 26వ వార్డులో చేపట్టిన ప్రార్థనా మందిర శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. నిర్మాణదారులను అభినందించారు. రాజీవ్ గృహ ప్రాంగణాన్ని ఎవరూ పట్టించుకోకపోతే తామే సీసీరోడ్ల నిర్మాణం చేపట్టి వర్షాకాలంలో సైతం రాకపోకలు సాగించేలా అభివృద్ధి చేశామన్నారు.

యువతలో నైపుణ్యం పెంపుదలకు కృషి

నరసరావుపేట రూరల్: యువతలో నైపుణ్యాలను పెంపొందించి వారికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పార్లమెంట్ కేంద్రంలో స్కిల్ కళాశాలను ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎండీ సత్యనారాయణ తెలిపారు. కోటప్పకొండలోని స్కిల్ కళాశాలను శనివారం సీడాప్ సీఈఓ ఎంకేవీ శ్రీనివాసులులతో కలసి సందర్శించారు. స్కిల్ కళాశాలలో శిక్షణ పొందుతున్న అభ్యర్థులతో మాట్లాడారు. వసతి గృహంలో విద్యార్థులకు అందుతున్న వసతులపై ఆరా తీశారు.నాలుగు నెలల శిక్షణను పూర్తిగా ఉచితంగా అందిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సీడాప్ జేడీఎం బి.శివప్రసాదరెడ్డి, డీఎస్‌డీఓ పి.ప్రణయ్, ఏడీఎస్‌డీఈ వీహెచ్ ప్రసన్నకుమార్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ రవీంద్రనాయక్ పాల్గొన్నారు.

అసైన్డ్ భూమి వివరాలు వెంటనే అందజేయండి

నరసరావుపేట: జిల్లాలో అసైన్డ్ అగ్రికల్చర్ భూమికి సంబంధించి ప్రతిపాదనలను సోమవారం నాటికి అందజేయాలని జాయింట్ కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్ సంబంధిత రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో గురజాల, సత్తెనపల్లి, నరసరావుపేట రెవెన్యూ డివిజన్ అధికారులతో పలు రెవెన్యూ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అవసరమైన చోట శ్మశాన వాటికల నిర్మాణానికి రానున్న 15 రోజులు లోపల ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. అదేవిధంగా ప్యూరిఫికేషన్ ఆఫ్ ల్యాండ్ రికార్డుల పనులను వేగవంతం చేసి అవసరమైనచోట సరిహద్దు రాళ్లను ఏర్పాటు చేయాలన్నారు. భూముల రీ-సర్వే పూర్తైచోట అర్హులైన వారికి భూ హక్కు అందజేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, రెవెన్యూ డివిజనల్ అధికారులు ఎం.శేషిరెడ్డి, అద్దయ్య, రాజకుమారి, కలెక్టర్ కార్యాలయ ఏవో అనీల్ కుమార్, హెచ్ సెక్షన్ సూపరిండెంట్ కుటుంబరావు పాల్గొన్నారు.

కోటప్పకొండ- కొండవీడుకోట ఆలయం అనుసంధానం

దేవదాయశాఖ డెప్యూటీ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి



స్వాగత ద్వారాన్ని పరిశీలిస్తున్న ఈమని చంద్రశేఖరరెడ్డి, ఏసీ సత్యనారాయణరెడ్డి

యడ్లపాడు: కొండవీడు చారిత్రక ప్రదేశంగానే కాకుండా ఆధ్యాత్మిక కేంద్రంగానూ అభివృద్ధికి దేవదాయ శాఖ కృషి చేస్తుందని ఆ శాఖ డెప్యూటీ కమిషనర్ ఈమని చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. పల్నాడు జిల్లాలోని పర్యాటక కేంద్రం కొండవీడుకోటను శనివారం పర్యటించారు. ఘాట్‌రోడ్డు మీదుగా కొండపైకి చేరుకుని స్వాగత ద్వారం, మహాద్వారం, చిల్డ్రన్స్ పార్కు, ప్రజాకవి వేమన మండపం, శివాలయ ప్రాంతంతో పాటు ఆ శాఖ ఆధ్వర్యంలో పునర్ నిర్మితం చేసి న రెడ్డి రాజుల కాలంనాటి లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని పరిశీలించారు.

అన్ని సౌకర్యాలు ఏర్పాటు..

అన్ని సౌకర్యాలను కల్పించిన తర్వాతనే పునఃనిర్మితమైన పురాతన లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రతిష్ఠా కార్యక్రమం నిర్వహించనున్నట్లు దేవదాయశాఖ డెప్యూటీ కమిషనర్ ఈమని చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఆలయంలో ప్రతిష్ఠకు టీటీడీ నుంచి 80:20 నిష్పత్తిలో చెక్కించిన గరుడ ఆల్వార్ విగ్రహాలను సిద్ధం చేసి తమ శాఖకు అప్పగించినట్లు వెల్లడించారు. వీటిని కొండవీడులోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో భద్రపరిచినట్లు వివరించారు. కోటలోని లక్ష్మీనరసింహ ఆలయం ఆర్థిక స్థిరత్వం లభించే వరకు దీనిని కోటప్పకొండపై ఉన్న త్రికోటేశ్వర దేవస్థానానికి అనుసంధానం చేయనున్నట్లు డీసీ వెల్లడించారు.

పిడుగుపాటుకు వరికుప్ప దగ్ధం

రొంపిచర్ల: మండలంలోని మునమాక గ్రామంలో శనివారం పిడుగు పడి షేక్ కరాలపాటి ఖాశింబీకి చెందిన రెండు ఎకరాల వరి కుప్ప దగ్ధమైంది. ప్రమాదంలో సుమారు రూ.1.5 లక్షల విలువ చేసే ధాన్యం బుగ్గిపాలైంది. సమాచారం తెలుసుకున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు దగ్ధమైన వరి కుప్పను పరిశీలించారు. పిడుగుపాటుకు గురై పొగలు వస్తుండటంతో దగ్గరులో ఉన్న రైతులందరూ వరి కుప్ప దగ్గరకు వెళ్లి మంటను ఆర్పే ప్రయత్నాలు చేశారు.

రాష్ట్రంలో ప్రజారంజక పాలన

నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

రొంపిచర్ల: రాష్ట్రంలో ప్రజా రంజక పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డిని ప్రజలు ఆశీర్వదించాలని నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలో నల్లగార్లపాడు గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగిన శ్రీ వీరాంజనేయస్వామి వారి 42వ తిరునాళ్ల మహోత్సవ వేడుకలలో శాసన సభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ పచ్చవ రవీంద్రబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నెం పున్నారెడ్డి, గుండాల వెంకటేష్, కురుగంట శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం



చెక్కు అందజేస్తున్న అడ్మిన్ ఎస్పీ

నరసరావుపేట: ఆపదలో ఉన్న పోలీస్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు సేవలందించడానికి పల్నాడు జిల్లా పోలీస్ విభాగం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని జిల్లా అదనపు అడ్మిన్ ఎస్పీ జి.బిందుమాదవ్ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ వై. రవిశంకర్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం గతంలో విధులు నిర్వహిస్తూ ప్రమాదవశాత్తు మృతిచెందిన హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులకు పోలీస్‌శాఖ తరఫున చేయూత ద్వారా ఆర్థిక సహాయాన్ని జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేశారు. గురజాల పట్టణ పోలీస్‌స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ జనవరి ఐదవ తేదీన ప్రమాదవశాత్తు హెడ్‌కానిస్టేబుల్ టి.సుబ్బారావు మృతిచెందారు. ఈ మేరకు వారి కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని ఆయన కుమారుడైన సంతోష్‌కుమార్‌కు రూ.1లక్ష చెక్కు, అదనపు కార్పస్‌ఫండ్ కింద మరో రూ.1లక్ష చెక్కును అందజేశారు. అదేవిధంగా వీఆర్ విభాగంలో విధులు నిర్వహిస్తూ గతేడాది నవంబరు 27వ తేదీన ప్రమాదవశాత్తు మృతిచెందిన కానిస్టేబుల్ డి.శ్రీకాంత్ కుటుంబానికి సహాయంగా ఆయన సతీమణి సత్యవతికి అదనపు కార్పస్ ఫండ్ రూ.1 లక్ష చెక్కును అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పోలీస్ కార్యాలయ ఏవో రామారావు, జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు మాణిక్యాలరావు, క్లర్క్ మాధవి పాల్గొన్నారు.

రూ.40 లక్షల సీఎం రిలీఫ్‌ఫండ్

నరసరావుపేట: స్థానిక ప్రకాష్‌నగర్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం నియోజకవర్గంలోని 37 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.40 లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే గోపిరెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యశ్రీలో వైద్యసేవలు అమలుకాని జబ్బులకు సీఎం సహాయ నిధి నుంచి డబ్బులు అందజేయటం జరుగుతుందన్నారు. ఆరోగ్యశ్రీ కోసం సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఏడాదికి రూ.2 వేల కోట్లు ఖర్చు చేస్తున్నారన్నారు. నాడు- నేడు కింద వైద్యశాలల నిర్మాణం, డాక్టర్లు, సిబ్బంది నియామకం, మెడికల్ కళాశాల నిర్మాణం కోసం రూ.12 వేల కోట్లు ఖర్చు చేస్తున్నారన్నారు. పెద్దఎత్తు న పేద వారిని ఆదుకోవటం లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. చెక్కులు తీసుకున్న వారందరూ సీఎం జగన్‌కు ధన్యవాదాలు తెలియచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో షేక్ కార్పొరేషన్ చైర్మన్ ఆషాబేగం ఖాజావలి, ముదిరాజు కార్పొరేషన్ డైరెక్టర్ ఇయం స్వామి, రొంపిచర్ల ఎంపీపీ గడం బాలనాగమ్మ వెంకటరావు, మండల కన్వీనర్ పచ్చవ రవీంద్రబాబు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- మండలంలో వైఎస్సార్ ఆసరా పథకం సంబరాలు
- 778 గ్రూపులకు గాను రూ. 6.78 కోట్లు జమ



మహిళలకు ఆసరా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

ఈపూరు: మహిళలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి వారి ఆర్థికాభివృద్ధికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తోడ్పడుతున్నారని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. మండల కేంద్రమైన ఈపూరులోని వైఎస్సార్ ఆసరా మూడో విడత సంబరాలు శనివారం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ ఈపూరు మండలంలో 778 గ్రూపుల్లో 7780 మంది సభ్యులకు 3వ విడత రూ.6.78 కోట్లు వారి ఖాతాలకు జమయ్యాయన్నారు. అమ్మ ఒడి, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా వంటి అనేక సంక్షేమ పథకాలు మహిళల అభ్యున్నతి కోసం ప్రవేశపెట్టినట్లు చెప్పారు. రాజకీయంగా, సామాజికంగా, ఉద్యోగాల్లో తదితర రంగాల్లో మహిళలకు రిజర్వేషన్‌లు కల్పించినట్లు తెలిపారు. ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసి మహిళల పేరుపై పట్టాలు మంజూరు చేశారన్నారు.

అన్ని రంగాల్లో ఈసీఈ టెక్నాలజీ

నరసరావుపేట ఈస్ట్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో మారుతున్న సాంకేతికను విద్యార్థులు అందిపుచ్చుకొని తమ అభ్యున్నతికి బాటలు వేసుకోవాలని డాక్టర్ వైఎస్సార్ ఏఎన్‌యూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పి.సిద్దయ్య తెలిపారు. జేఎన్‌టీయూ-ఎన్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో శనివారం జాతీయస్థాయి సాంకేతిక సమ్మేళనం నిర్వహించారు. సమ్మేళనాన్ని ప్రారంభించిన ప్రొఫెసర్ సిద్దయ్య మాట్లాడుతూ నేడు అన్ని రంగాలలోనూ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ సాంకేతికత కీలకంగా మారిందన్నారు. సమ్మేళనంలో వివిధ కళాశాలల నుంచి దాదాపు 600 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సమ్మేళనం చైర్మన్, కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సిహెచ్.శ్రీనివాసరావు, కన్వీనర్ ఏ.గంగాధర్, కోఆర్డినేటర్లు వి.హరికృష్ణ, ఏ.రాధ, స్టూడెంట్ కోఆర్డినేటర్లు ఎస్.కావ్య, కె.రత్నకుమార్ పాల్గొన్నారు.